
సాక్షి
అనంతపురం
మంగళవారం । 31 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.27,420

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.27,420 పలికాయి.



టమాట కిలో రూ.7

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.7 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.5 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.4°/14.9°

జిల్లా అంతటా సోమవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

యువత సామాజిక స్పృహ కలిగి ఉండాలి



ప్రశంసాపత్రం అందజేస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాస్

అనంతపురం: యువత సామాజిక స్పృహ కలిగి ఉండాలని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి. శ్రీనివాస్ అన్నారు. న్యాయ అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సోమవారం ఆయన జిల్లా కోర్టులో ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను బుగ్గిపాలు చేసుకోరాదన్నారు. ఇటీవలి కాలంలో అత్యాచార ఘటనలు పెరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. అత్యాచార ఘటనలపై నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని తెలిస్తే సమీపంలోని కోర్టులో గానీ పోలీస్‌స్టేషన్‌లో గానీ ఫిర్యాదు చేయవచ్చన్నారు. జిల్లా న్యాయ సేవాసదన్‌లో సమాచారం అందజేస్తే వివరాలను గోప్యంగా ఉంచుతారని చెప్పారు. అనంతపురంలోని ఓ చిన్న పిల్లల ఆసుపత్రిలో అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదును జిల్లా న్యాయసేవాసదన్‌లో ఇవ్వగా, న్యాయమూర్తి ఆకస్మికంగా తనిఖీ చేసి చర్యలు తీసుకున్నారని తెలిపారు. జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి జి. శివప్రసాద్ యాదవ్, లా కళాశాల అధ్యాపకులు ఆర్. కల్పన, డాక్టర్ రమ్య, న్యాయవాది ఎస్. హరికృష్ణ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

అనంతపురం రూరల్: ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీగా ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలి వరకూ ఈడీగా పని చేసిన సారయ్యను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఇన్‌చార్జ్ బాధ్యతలను ప్రతాప్ సూర్యనారాయణరెడ్డికి అప్పగించింది. ఈ క్రమంలోనే ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు.

ఎస్కేయూలో జడలు విప్పిన ర్యాగింగ్ భూతం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ భూతం మళ్లీ జడలు విప్పింది. కొన్ని రోజులుగా క్యాంపస్ ఎంబీఏ విభాగంలో ర్యాగింగ్ జరుగుతున్నట్లు తెలిసింది. చిత్రావతి హాస్టల్‌లో ఎంబీఏ సీనియర్ విద్యార్థులు జూనియర్ల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో జూనియర్ విద్యార్థులందరినీ గ్రూపుగా నిలబెట్టి ర్యాగింగ్ చేశారు. బిగ్గరగా అరుస్తూ భయభ్రాంతులకు గురిచేశారు. తాము చెప్పే వరకు నిలబడే ఉండాలంటూ వేధించారు. తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పేంత వరకు రూములోకి వెళ్లనివ్వలేదు. ర్యాగింగ్ చేసినట్లు బయటకు చెబితే అంతుచూస్తామంటూ బెదిరించినట్లు తెలిసింది. ఇప్పటికైనా వర్సిటీ ఉన్నతాధికారులు స్పందించి ఎంబీఏ జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ భూతం నుంచి కాపాడాల్సి ఉంది.

హత్య కేసులో ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష

అనంతపురం: హత్య కేసులో ముద్దాయికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష పడింది. అలాగే, రూ.10 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ సోమవారం తీర్పు వెలువరించారు.వివరాలు.. బుక్కరాయసముద్రం మండలం అనంతసాగర్ కాలనీకి చెందిన వినోద్‌కుమార్‌ను 2022 ఏప్రిల్ 14న అదే కాలనీకి చెందిన మరూరు రత్నమయ్య కత్తితో ఛాతిపై పొడిచి హత్య చేశాడు. గతంలో వైన్‌షాపుల వద్ద జరిగిన గొడవలను మనసులో పెట్టుకుని వినోద్ కుమార్‌ను చంపితే.. అతని సామాజికవర్గంలో తానంటే భయం ఉంటుందనే కారణంతో దారుణంగా చంపాడు. ఈ హత్యా ఘటనపై బుక్కరాయసముద్రం పోలీసులు 2022 ఏప్రిల్ 15న కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ డి. రాము దర్యాప్తు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున 8 మంది సాక్షులను విచారించగా, రత్నమయ్యపై నేరం రుజువైంది. దీంతో ముద్దాయికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ సోమవారం సంచలన తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున రాచమల్లు హరినాథ రెడ్డి వాదనలు వినిపించారు. కేసులో బలమైన సాక్ష్యాలు సేకరించి ముద్దాయికి శిక్ష పడేలా అప్పటి సీఐ డి. రాము కృషి చేశారు. కోర్టు మానిటరింగ్ సిస్టం సీఐ వెంకటేశ్ నాయక్, ఏఎస్‌ఐ మల్లిరెడ్డి, కానిస్టేబుళ్లు బి. రామమోహన్, ఏ. ప్రదీప్ కుమార్, లైజన్ ఆఫీసర్ శ్రీనివాసులు సాక్షులను కోర్టుకు హాజరుపరచడంలో కృషి చేశారు. వీరందరినీ జిల్లా ఎస్పీ పి. జగదీష్ అభినందించారు.

విధ్వంసం.. విషాదం



విధ్వంస రచన : కూటమి ప్రభుత్వం వచ్చాక బొమ్మనహాళ్ మండలం కురువల్లిలో గ్రామ సచివాలయ శిలాఫలకాన్ని పగులకొడుతున్న టీడీపీ కార్యకర్తలు (ఫైల్)

పెరిగిన నేరాలు.. ఘోర రోడ్డు ప్రమాదాలు.. విచ్చలవిడిగా అసాంఘిక కార్యకలాపాలు వెరసి 2024 ఏడాది అందరికీ చేదు జ్ఞాపకాలనే మిగిల్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆరు నెలల్లోనే ఊరూరా బెల్టుషాపులు, విచ్చలవిడిగా జూద కేంద్రాలు వెలిశాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల విధ్వంసం, భూకబ్జాలు, సహజ వనరుల దోపిడీ, ప్రజలపై దాడులు అధికమయ్యాయి.
– అనంతపురం



నాయనపల్లిక్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇస్కాన్ భక్తులు (ఫైల్)

చేదు జ్ఞాపకాలు మిగిల్చిన 2024

- జిల్లాలో పెరిగిన నేరాలు
- దిగ్భ్రాంతి పరిచిన ఘోర రోడ్డు ప్రమాదాలు
- కూటమి ప్రభుత్వం వచ్చాక అదుపుతప్పిన శాంతిభద్రతలు
- యథేచ్ఛగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల ధ్వంసం
- అడ్డూఅదుపు లేని గంజాయి విక్రయాలు
- ఊరికో బెల్టుషాపు, 10 వేల మందికో వైన్‌షాపు

రక్తమోడిన రహదారులు..



శింగనమల మండలం నాయనపల్లిక్రాస్ వద్ద కారును ఢీకొన్న లారీ (ఫైల్)

జిల్లాలో ఈ ఏడాది జరిగిన పలు ఘోర రోడ్డు ప్రమాదాలు దిగ్భ్రాంతి కలిగించాయి. నవంబర్ 24న గార్లదిన్నె సమీపంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై ఆటోను బస్సు ఢీకొనగా.. ఎనిమిది మంది వ్యవసాయ కూలీలు మరణించిన ఘటన జిల్లాలో విషాదం నింపింది. అలాగే తాడిపత్రికి 'సంకీర్తన'కు వెళ్లి వస్తూ ఆరుగురు ఇస్కాన్ భక్తులు రోడ్డుప్రమాదంలో మరణించిన ఘటన కలచివేసింది. అక్టోబర్ 27న శింగనమల మండలం నాయనపల్లి క్రాస్ వద్ద చోటుచేసుకున్న ఈ దుర్ఘటన అయిన వారికి తీరని శోకం నింపింది. అలాగే సెప్టెంబర్ 22న బుక్కరాయ సముద్రం మండల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు స్నేహితుల మృత్యువాత, మే 18న గుత్తి జాతీయ రహదారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అక్కడికక్కడే మృతి చెందడం, ఆగస్టు 21న తాడిపత్రి సమీపంలో వంగనూరు వద్ద లారీ, కారు ఢీ కొనడంతో ముగ్గురు దుర్మరణం పాలవడం, నవంబర్ 30న విడపనకల్లు వద్ద కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు డాక్టర్లు మృతి చెందడం వంటి ఘటనలు అందరినీ షాక్‌కు గురి చేశాయి.



మద్యం ఏరులు..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మద్యం అమ్మకాలను కట్టడి చేయగా.. కూటమి సర్కారు వచ్చాక విచ్చలవిడిగా అందుబాటులోకి తెచ్చింది. ప్రతి పది వేల మంది జనాభాకు ఓ వైన్‌షాపు ఏర్పాటు చేసింది. అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో ఊరూరా బెల్టు షాపులు వెలిశాయి. దీంతో మద్యం ఏరులై పారుతోంది. తప్పతాగి పలువురు ప్రాణాల మీదికి తెచ్చుకున్నారు. ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు భారీగా నమోదయ్యాయి. పోలీసులు మొత్తం 2,314 కేసులు నమోదు చేసి.. రూ.2.40 కోట్ల జరిమానా విధించారు.

'పచ్చ' మూకల విధ్వంసం

జూన్‌లో ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీ కార్యకర్తల దాష్టీకంతో జిల్లాలో నేరాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఉన్మాదంతో రెచ్చిపోయిన టీడీపీ కార్యకర్తలు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా బీభత్సం సృష్టించారు. వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల విధ్వంసంతో పాటు హత్యలకు కూడా తెగబడ్డారు. జూన్ 27న పుట్లూరు మండలం కోమటికుంట్ల గ్రామంలో టీడీపీ నాయకులు బండరాళ్లతో దాడి చేసి వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎరికలయ్యను హత్య చేశారు. తాడిపత్రితో పాటు మరికొన్ని నియోజకవర్గాల్లో భారీ ఎత్తున దాడులకు పాల్పడ్డారు.



అరాచకాలకు పరాకాష్ట : కూటమి ప్రభుత్వం వచ్చాక బొమ్మనహాళ్ మండలం దేవగిరిలో గ్రామ సచివాలయ ఆర్చ్ వద్ద వైఎస్సార్ బొమ్మను సుత్తితో పగులకొడుతున్న టీడీపీ కార్యకర్త (ఫైల్)



దొంగల హల్‌చల్..

జిల్లాలో ఈ ఏడాది దొంగలు రెచ్చిపోయారు. దోపిడీలు, పగలు, రాత్రి తేడా లేకుండా చైన్ స్నాచింగ్‌లు, సాధారణ చోరీలు.. ఇలా అన్ని రకాల దొంగతనాలు గతేడాదితో పోలిస్తే పెరిగాయి. అన్ని రకాల దొంగతనాలు కలిపి జిల్లాలో ఈ ఏడాది 529 నమోదయ్యాయి. రూ.7.31 కోట్ల సొమ్మును ప్రజలు నష్టపోయారు.

● గం'జాయ్'



కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో గంజాయి వినియోగం విపరీతంగా పెరిగింది. ఇంజినీరింగ్, ఫార్మసీ విద్యార్థులనే లక్ష్యంగా చేసుకుని గంజాయి విక్రయిస్తున్నారు. ఇటీవల 10 మంది గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. 18 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు గంజాయి సేవిస్తున్నారనే సమాచారంతో పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేశారు. ఇప్పటి దాకా 15 కేసుల్లో 63 మందిని అరెస్ట్ చేశారు. మొత్తం 60 కేజీల గంజాయిని సీజ్ చేయడం గమనార్హం.

● పురివిప్పిన జూదం..



జిల్లాలో పేకాట, మట్కా శిబిరాలు భారీగా వెలిశాయి. నిర్వాహకులు వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారం చేరవేసుకుంటూ ఎక్కడికక్కడ జూద శిబిరాలు నడుపుతున్నారు. మట్కా, పేకాటకు సంబంధించి పోలీసులు మొత్తం 1,192 కేసులు నమోదు చేసి.. 3,250 మందిని అరెస్ట్ చేశారు. రూ.1.98 కోట్లు సీజ్ చేశారు. అయినప్పటికీ జూదాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

● సైబర్ నేరగాళ్ల సవాల్..



ఈ ఏడాది సైబర్ నేరగాళ్లు అందినకాడికి దోచుకున్నారు. కొందరి అత్యాశను అనుకూలంగా మార్చుకున్నారు. ఖాతాలను ఖాళీ చేశారు. గతేడాది సైబర్ నేరాలు 40 నమోదు కాగా, ఈ ఏడాది కూడా అదే స్థాయిలో నమోదు కావడం గమనార్హం. గతేడాది రూ.1.45 కోట్లు పోగొట్టుకోగా, ఈ ఏడాది రూ.1.76 కోట్లు నష్టపోయారు.

దయ చూపండి

- ఉన్నతాధికారుల ఎదుట బాధితుల ఆవేదన
- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో 306 వినతులు

అనంతపురం అర్బన్: 'సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీలు ఇస్తూనే ఉన్నాము. ఒకసారి కాకుంటే మరోసారైనా దయచూపకపోతారా అనే ఆశతో తిరుగుతున్నాం' అంటూ ఉన్నతాధికారుల ఎదుట అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో పాటు అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్‌ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, తిప్పేనాయక్, శిరీష, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 306 వినతులు అందాయి. ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపంగా అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో ఇన్‌చార్జ్ కలెక్టర్ సమీక్షించారు.

పనితీరు సరిగా లేదు..

అర్జీల పరిష్కారం విషయంలో పోలీసు శాఖ పనితీరు సరిగా లేదంటూ ఇన్‌చార్జ్ కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అందిన అర్జీలను ఆన్‌లైన్‌లో కనీసం ఓపెన్ చేయకపోవడం ఏమిటంటూ అసహనం వ్యక్తం చేశారు. వాటిని వెంటనే ఓపెన్ చేసి 24 గంటల్లో పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పరిష్కరించే విషయంలో వ్యవసాయ, ప్రజారోగ్య, పంచాయతీరాజ్, ఎస్పీడీసీఎల్, గృహ నిర్మాణ సంస్థ,మరో 15 శాఖలు టాప్20లో ఉన్నాయంటూ అభినందించారు. మిగిలిన శాఖలు ఇదే తరహాలో అర్జీలు పరిష్కరించాలని ఆదేశించారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, అధికారులు

వినతుల్లో కొన్ని...

- పట్టాలు ఇచ్చిన భూములకు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని తాడిపత్రి మండలం ఆలూరుకు చెందిన వెంకటప్రసాద్, తదితరులు విన్నవించారు. గ్రామంలోని సర్వే నెంబరు 446–ఈ1,బీ2, 447–బి, ఏ–1బీ,ఏ–2బీ, 462–బీ2, 463–బీలోని బంజరు భూమికి పట్టాలు ఇవ్వడంతో సాగు చేసుకుంటున్నామని చెప్పారు. 1994లో ప్రభుత్వం తమ భూముల్లో మట్టిని తీసి చెరువుకట్టకు వేసియడంతో గుంతలు ఏర్పడ్డాయన్నారు. నష్టపరిహారం రాకపోవడంతో గుంతలను తామే పూడ్చుకుని సాగు చేసుకుంటున్నామని చెప్పారు. వీటికి పట్టాదారు పాసు పుస్తకాల మంజూరుకు ఉత్తర్వులు ఇవాలని కోరారు.
- తమ భూమిని వేరొకరి పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేశారని అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లికి చెందిన బి.తిరుపతయ్య ఫిర్యాదు చేశాడు. బుక్కరాయసముద్రం మండలం సిద్ధరాంపురం గ్రామ పొలం సర్వే నంబరు 336–1లో 4.50 ఎకరాలు తమకు ఉందని చెప్పాడు. ఈ భూమి నలుగురి పేరున ఆన్‌లైన్‌లో ఎక్కించారని, ఈ వివాదంపై తాను కోర్టును ఆశ్రయించగా, కేసు పెండింగ్‌లో ఉందని తెలిపాడు. వివాదాస్పద భూముల జాబితాలో నమోదుచేసి హోల్డ్‌లో ఉంచడంతో పాటు విచారణ చేసి పాసుపుస్తకాలు రద్దు చేయాలని కోరాడు.

'నూతన' వేడుకలు ప్రశాంతంగా జరుపుకోండి

- ఎస్పీ పి. జగదీష్



అనంతపురం: ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు చేసుకోవాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఓ ప్రకటనలో సూచించారు. రహదారులు, పబ్లిక్ స్థలాల్లో వేడుకలు అనుమతించేది లేదన్నారు. టపాసులు కాల్చడంపై నిషేధం విధించామన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపరాదన్నారు. విచక్షణారహితంగా వాహనాలు నడిపి ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవద్దని హితవు పలికారు. మద్యం దుకాణాలు, రెస్టారెంట్లు, బార్లు నిర్ణీత సమయంలోపు మూసివేయాలన్నారు. అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతపురంలో భారీ ఎత్తున పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. రోడ్లపై యువత మద్యం సేవిస్తూ, బైకులపై ఇష్టారాజ్యంగా తిరుగుతూ ఇతరులకు ఇబ్బంది పెడితే ఉపేక్షించమన్నారు. మహిళలు, బాలికలపై కామెంట్, టీజింగ్‌కు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కువ శబ్దాలు వచ్చే డీజే సౌండ్ సిస్టం వంటివి ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని, బైకులకు సైలెన్సర్‌లు తీసేసి, విన్యాసాలు చేస్తూ అధిక శబ్దాలు చేస్తే వాహనాలు సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా ప్రయత్నిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. జిల్లా అంతటా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని, డీఎస్పీల అనుమతి లేకుండా ఎటువంటి సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదని సూచించారు.

3న జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

అనంతపురం ఎడ్యుకేషన్: రాప్తాడు మోడల్ స్కూల్‌లో జనవరి 3న జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు (సైన్స్‌ఫేర్) నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు, జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ యాజమాన్యాల ఉన్నత పాఠశాలల 8,9,10 తరగతుల విద్యార్థులు సైన్స్, గణితానికి సంబంధించి వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారని వెల్లడించారు. 2న మండలస్థాయిలో సైన్స్‌ఫేర్ నిర్వహించాలని సూచించారు. మండలస్థాయికి ప్రతి పాఠశాల నుంచి మూడు విభాగాల్లో (ఒకరు, గ్రూపు, టీచర్స్ కేటగిరి) ప్రాజెక్టులు ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. ప్రతి మండలం నుంచి మూడు విభాగాల్లో ఒక్కో ప్రాజెక్టును జిల్లాస్థాయికి ఎంపిక చేసి పంపాలని ఆదేశించారు. కొత్తకొత్త ఆవిష్కరణలు, ఆలోచనలకు అద్దంపట్టేలా ప్రాజెక్టులు తయారు చేసేలా సైన్స్, గణితం టీచర్లు చొరవ తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల కేటగిరీల నుంచి ఆశించిన స్థాయిలో ప్రాజెక్టులు వస్తున్నా, టీచర్ల కేటగిరీ నుంచి మరి ఏమాత్రం భాగస్వామ్యం ఉంటుందో వేచి చూడాలి.

దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం



రన్నింగ్ చేస్తున్న అభ్యర్థులు

అనంతపురం: స్థానిక నీలం సంజీవరెడ్డి స్టేడియంలో సోమవారం కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఎస్పీ పి. జగదీష్ ప్రక్రియను పర్యవేక్షించారు. మొత్తం ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేశారు. జనవరి 17 వరకు ఈవెంట్స్ జరగనున్నాయి. పురుష అభ్యర్థులు 5,242, మహిళా అభ్యర్థులు 1,237 మంది హాజరుకానున్నారు. దేహదారుఢ్య పరీక్షల్లో ఏవైనా అనుమానం తలెత్తితే జనవరి 17న అప్పీలు చేసుకోవచ్చు.

మీడియాపై ఆంక్షలు..

పోలీస్ కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలకు సంబంధించి నీలం సంజీవరెడ్డి స్టేడియంలో నిర్వహిస్తున్న ఈవెంట్ కవరేజీకి మీడియాకు అనుమతించలేదు. ఏ మీడియా సంస్థ ప్రతినిధులు కూడా లోపలికి వెళ్లడానికి వీల్లేదంటూ ఎస్పీ ఆదేశాలు జారీ చేయడం వివాదాస్పదమవుతోంది. పకడ్బందీగా దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొంటూనే మీడియాను అనుమతించకపోవడం గమనార్హం. మరోవైపు స్టేడియం మార్గంలో వాహన రాకపోకలపైనా ఆంక్షలు విధించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేవలం అభ్యర్థులు వచ్చి, వెళ్లే సమయంలో ఆంక్షలు విధించవచ్చు. కానీ రోజంతా ట్రాఫిక్ మళ్లింపు చేయాలని నిర్ణయించడంపై ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.



ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఎస్పీ జగదీష్



అభ్యర్థి ఛాతి కొలుస్తున్న పోలీసులు



లక్ష్మీనగర్ రోడ్డును పూర్తిగా మూసివేసిన దృశ్యం

క్లుప్తంగా

విషపూరిత గడ్డి తిని గొర్రెల మృతి



గొర్రెల కళేబరాలు పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రత్నాకర్

బుక్కరాయసముద్రం: మండలంలోని బాట్లో కొత్తపల్లి గ్రామంలో విషపూరిత గడ్డి తిని 10 గొర్రెలు మృతి చెందాయి. బాధితుడు తెలిపిన మేరకు.. గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్న బాట్లో కొత్తపల్లికి చెందిన వీర నారప్ప సోమవారం తన జీవాలను మేపు కోసం 44వ జాతీయ రహదారి పక్కన వదిలాడు. ఈ క్రమంలో విషపూరిత గడ్డి తిని పది గొర్రెలు విషమ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతుండగా పశువైద్యాధికారులకు బాధిత కాపరి సమాచారం అందించాడు. దీంతో పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రత్నాకర్, వైద్య బృందం భాను ప్రకాష్, రజాక్ ప్రవీణ్, చైతన్య అక్కడకు చేరుకుని సత్వర చికిత్స మొదలుపెట్టారు. పరిస్థితి విషమించి 10 గొర్రెలు మృతి చెందాయి. దీంతో రూ.1.50లక్షలు నష్టపోయినట్లు బాధితుతు వాపోయాడు.

బైక్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య



రాజేష్ (ఫైల్)

గుత్తి రూరల్: ద్విచక్ర వాహనాన్ని తల్లిదండ్రులు కొనివ్వకపోవడంతో క్షణికావేశానికి లోనై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం శ్రీపురం గ్రామానికి చెందిన పులి శేఖర్, సరోజ దంపతుల కుమారుడు రాజేష్ (22) గుంతకల్లులోని కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ఖాళీ సమయాల్లో తల్లిదండ్రులతో కలసి కూలి పనులకు వెళ్లేవాడు. ఈ క్రమంలో తనకు బైక్ కొనివ్వాలని కొన్ని నెలలుగా తల్లిదండ్రులను రాజేష్ ఒత్తిడి చేస్తూ వచ్చాడు. అయితే తమకున్న రెండు ఎకరాల పొలంలో చేపట్టిన పంటల సాగులో దిగుబడులు లేక అప్పుల పాలయ్యామని, కొన్ని రోజులు ఆగితే బైక్ కొనిస్తానని తండ్రి నచ్చచెబుతూ వచ్చాడు. ఆదివారం సాయంత్రం మరో సారి బైక్ కొనాలంటూ రాజేష్ మొండిపట్టు పట్టాడు. తలిదండ్రులు ఎంత నచ్చచెప్పినా వినలేదు. ఈ క్రమంలో సోమవారం ఉదయం నిద్ర లేచి తల్లిదండ్రులతో పాటు సోదరి కూడా ఉపాధి పనులకు వెళ్లింది. ఆ సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న రాజేష్ పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన తల్లి... ఉరికి విగతజీవిగా వేలాడుతున్న రాజేష్‌ను చూసి బిగ్గరగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు అక్కడకు చేరుకుని రాజేష్‌ను కిందకు దించి చూశారు. అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారణ కావడంతో తల్లిదండ్రుల వేదనకు అంతులేకుండా పోయింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువస్తే.. ఇప్పటి కూటమి ప్రభుత్వం వైద్య రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంటి వద్దకే వైద్యులు వెళ్లే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, జగనన్న ఆరోగ్య సురక్ష, వైఎస్సార్ కంటి వెలుగులాంటి బృహత్తర కార్యక్రమాలను అటకెక్కించడమే ఇందుకు నిదర్శనం. దీంతో పాటు పీహెచ్‌సీ, ఏరియా, ప్రభుత్వ సర్వజనాస్పత్రుల్లో మందుల కొరత తీవ్రంగా నెలకొంది. ఆరోగ్యశాఖ అవినీతి మయంగా మారిందన్న విమర్శలూ లేకపోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఆరు నెలల్లోనే వైద్య రంగం దారుణమైన సంక్షోభంలో కూరుకుపోయింది.

–అనంతపురం మెడికల్



నిర్వహణ లేక రాప్తాడులో ఆపేసిన 108 వాహనాలు

వైద్యం.. నిర్వీర్యం!

● కూటమి పాలనలో పడకేసిన వైద్యం ● అటకెక్కిన ఆరోగ్య సురక్ష, కంటి వెలుగు పథకాలు ● ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత

ఆస్పత్రుల్లో మందుల కొరత



ప్రభుత్వ సర్వజనాస్పత్రితో పాటు జిల్లాలోని 45 పీహెచ్‌సీలు, 433 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లు (గతంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు), మూడు ఏరియా ఆస్పత్రులు (తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం), అనంతపురం సీడీ ఆస్పత్రి, ఉరవకొండ, పామిడి, కణేకల్లు, శింగనమల, కొనకొండ్లలోని సీహెచ్‌సీలు, 25 పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో డైక్లోఫినాక్ (నొప్పి మాత్ర), ఫిట్స్‌కు సంబంధించి లివిపిల్, హెప్టాయిన్, యాంటీ బయాటిక్స్ ఆమాక్సీ క్లేవ్, సిప్రో ఫ్లాక్సిన్, లెబటలాల్, ఆక్సోటోసిన్, గ్యాస్ట్రిక్ సంబంధించి ప్యాన్‌టాప్, ఇలా.. 30 నుంచి 50 రకాల మందుల కొరత పట్టిపీడిస్తోంది. కొన్ని ఆస్పత్రుల్లో దూది, హైడ్రోజన్ పెరాక్సైడ్, తదితర ఫస్ట్ ఎయిడ్ సామగ్రి కూడా లేదు. దీంతో నాణ్యమైన వైద్య సేవలు కొరవడి రోగులు ఇబ్బంది పడుతున్నారు.



గత ప్రభుత్వంలో గ్రామంలోనే వైద్య సేవలు (ఫైల్)

ఆగిన స్పెషలిస్టు వైద్యం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ప్రతి ఇంటికి వైద్యులు వెళ్లే పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆ కార్యక్రమాన్ని తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. ప్రధానంగా జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమంలో భాగంగా అప్పట్లో జిల్లాలో 422 హెల్త్ క్యాంపులు నిర్వహించి, 1,79,711 మందికి ఓపీ సేవలందించారు. ఆరోగ్య శాఖ సిబ్బంది 2,57,562 ఇళ్లను సర్వే చేసి 3,29,597 మందికి హైపర్‌టెన్షన్, డయాబెటీస్, హెచ్‌బీ, యూరిన్, మలేరియా, డెంగీ తదితర పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాలకు హాజరైన రోగుల్లో 485 మందిని హయ్యర్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. ఇప్పుడు ఆ కార్యక్రమం ఊసే లేకుండా పోయింది. అలాగే వైఎస్సార్ కంటి వెలుగు కింద దృష్టి లోపం ఉన్న వారికి స్క్రీనింగ్ నిర్వహించి, అనంతరం కళ్లద్దాల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికీ కూటమి ప్రభుత్వం నీళ్ల వదిలింది. గతంలో చికిత్స చేయించుకున్న జిల్లాలోని 5వేల మంది స్కూల్ విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేయాల్సి ఉంది.



గతి తప్పిన సర్వజనాస్పత్రి సేవలు



ఉమ్మడి జిల్లా ప్రజలకు పెద్ద దిక్కుగా ఉన్న ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సేవలు పూర్తిగా గతి తప్పాయి. ఆస్పత్రిలో రోజూ 2,500 మంది ఔట్‌పేషంట్లు సేవలు పొందుతుంటారు. 560 పడకల ఆస్పత్రిగా ఉన్నా.. 1,300 మంది వరకు అడ్మిషన్‌లో ఉంటారు. గత ప్రభుత్వంలో నాడు-నేడు కింద రూ.300 కోట్లతో ఎంసీహెచ్ బ్లాక్, సర్జికల్ బ్లాక్, పీజీ హాస్టల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సర్జికల్ బ్లాక్ పనులు 20 శాతం మాత్రమే పూర్తయ్యాయి. ఈ పనులను ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సర్జికల్, ఎంసీహెచ్ బ్లాక్‌లు పూర్తయితే 700 పడకల వరకు అందుబాటులోకి వస్తాయి. అలాగే బోధనాస్పత్రికి సంబంధించి రీ డిప్లాయిమెంట్ కింద 30 ట్యూటర్ పోస్టులను తిరుపతి, కర్నూలుకు బదిలీ చేశారు. దీంతో వైద్య విద్యలో నాణ్యత ప్రమాణాలు దెబ్బతినే అవకాశం లేకపోలేదు.

108 సేవలు మృగ్యం

అపర సంజీవనిగా పేరొందిన 108 అంబులెన్స్ సేవలను కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఈ ఏడాది నవంబర్‌లో డీజిల్ కొరతతో రెండ్రోజుల పాటు 108 సేవలు ఆగిపోయాయి. దీంతో క్షతగాత్రులు, రోగులు ప్రత్యక్ష నరకం చూశారు. జిల్లాలో మొత్తం 35 వాహనాలు ఉన్నాయి. ఇందులో అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ వాహనాలు 5, బేసిక్ లైఫ్ సపోర్ట్ వాహనాలు 25, పాత వాహనాలు 5, బ్యాక్ అప్ వాహనాలు 2, నియోనెటాల్ వాహనం 1 ఉన్నాయి. తరచూ వాహనాలు మరమ్మతుకు లోనవుతూ షెడ్డుకు చేరుతున్నాయి. వీటి మరమ్మతులకు సంబంధించి నిధులు కేటాయించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది.

ఆగిన ఆస్పత్రుల అభివృద్ధి



నత్తనడకన సాగుతున్న సర్వజనాస్పత్రిలోని సర్జికల్ బ్లాక్ భవన నిర్మాణం

గుంతకల్లు, తాడిపత్రి, రాయదుర్గం ఏరియా ఆస్పత్రుల భవనాలు నిర్మాణ దశలోనే ఉన్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వీటి నిర్మాణ పనులు వేగవంతంగా సాగాయి. ప్రభుత్వం మారిన తర్వాత వాటిని పట్టించుకునే పరిస్థితి లేదు. అనంతపురంలోని సర్వజనాస్పత్రి అభివృద్ధి పనులదీ ఇదే పరిస్థితి.

ఎటు చూసినా అవినీతి

ఆరోగ్య శాఖ మొత్తం అవినీతి మయంగా మారింది. సాక్షాత్తు ఓ కీలక అధికారి నిబంధనలకు విరుద్ధంగా 30 మందిని డిప్యూటేషన్ పేరుతో జిల్లా కేంద్రంలోనే ఉంచుకున్నారు. ఈ క్రమంలో వారి నుంచి రూ.లక్షల్లో ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. అలాగే ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులతోనూ కుమ్మక్కై రూ.లక్షల్లో దోపిడీ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



బయట మెడికల్ స్టోర్‌లో కొనుగోలు చేసిన మందులను చూపుతున్న సర్వజనాస్పత్రిలోని రోగి సంబంధీకురాలు

అట్రాసిటీ కేసులో ముగ్గురికి రిమాండ్

గార్లదిన్నె: మండలంలోని ఇల్లూరులో దళితుడి ఇంటిని ధ్వంసం చేసిన కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు గార్లదిన్నె ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. వివరాలను ఆయన సోమవారం వెల్లడించారు. ఈ నెల 20న రాత్రి ఇల్లూరు గ్రామానికి చెందిన మణికంఠ, స్వాతి దంపతులు ఇంట్లో నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు, రామాంజనేయులు, అల్లాబకాష్ ఐచర్ వాహనంతో ఇంటిని ఢీకొని ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఘటనలో గాయపడిన దంపతుల ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం ఉదయం కల్లూరు గ్రామంలోని తరిమెల క్రాస్ వద్ద నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

నట్టేట ముంచిన నాసిరకం కలుపు మందు

● ఆరు ఎకరాల్లో తుడిచిపెట్టుకు పోయిన టమాట పంట



పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

డి హీరేహాళ్(రాయదుర్గం): నాసిరకం కలుపు మందు నట్టేట ముంచిందని బాధిత రైతు ఆందోళన వ్యక్తం చేశారు. వివరాలు... డి.హీరేహాళ్ మండలం మురడి గ్రామానికి చెందిన రైతు మురళీమోహన్‌రెడ్డి ఆరు ఎకరాల్లో టమాట సాగు చేశాడు. పెట్టుబడి కోసం ఇప్పటికే రూ.5 లక్షలు ఖర్చుచేశాడు. కలుపు నివారణ చర్యల్లో భాగంగా రాయదుర్గం లోని గ్రోమర్ దుకాణంలో టర్క సూపర్ అనే కలుపు మందు కొనుగోలు చేశాడు. దుకాణ నిర్వాహకుల సూచన మేరకు ఎకరాకు 250 ఎంఎల్ చొప్పున పిచికారీ చేశారు. సాయంత్రానికే పైరు మొత్తం కాలి వాలి పోయింది. నాసిరకం కలుపు మందే నట్టేట ముంచిందంటూ గ్రోమర్ సిబ్బందిని గట్టిగా నిలదీశారు. న్యాయం చేయకపోతే వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాల్సి వస్తోందని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న ఉద్యాన శాఖ అధికారి మౌనిక, ఆగ్రోస్ సిబ్బంది పొలాన్ని సందర్శించారు. పంటను కాపాడే బాధ్యత తీసుకుంటామని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదంటూ రైతుకు సర్దిచెప్పారు. వారం రోజుల గడువు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మొక్కలను కాపాడేందుకు అవసరమైన మందులను డ్రిప్ ద్వారా సరఫరా చేయించారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి



మృతుడు సందీప్

కూడేరు: మండలంలోని చోళసముద్రం గ్రామానికి చెందిన బలిజ సంజీవరాయుడు కుమారుడు సందీప్(35) విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... తమ పొలంలో ఉన్న కొబ్బరి చెట్టు పట్టలు తగిలి తరచూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫ్యూజులు పోతున్నట్లుగా గుర్తించిన సందీప్ సోమవారం సాయంత్రం కొబ్బరి పట్టలు కొట్టేందుకు చెట్టుపైకి ఎక్కాడు. ఆ సమయంలో విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై కిందపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సందీప్ మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, సందీప్‌కు భార్య రాధమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.


ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీగా శెట్టిపి



శెట్టిపి జయచంద్రారెడ్డి

ధర్మవరం అర్బన్: ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీగా ధర్మవరం పట్టణానికి చెందిన శెట్టిపి జయచంద్రారెడ్డి ఎంపికయ్యారు. అనంతపురంలోని అశోక్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం సాయంత్రం జరిగింది. కార్యక్రమానికి అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ధర్మవరం నుంచి మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ బాస్కెట్‌బాల్ రాష్ట్ర జట్టుకు వరుసగా మూడుసార్లు ప్రాతిథ్యం వహించడమే కాకుండా పట్టణంలో బాస్కెట్‌బాల్ క్రీడాభివృద్ధికి 22 సంవత్సరాలుగా ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. బాల, బాలికలను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తున్న జయచంద్రారెడ్డిని ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీగా ఎంపిక చేయడంపై హర్షం చేశారు. కార్యక్రమంలో ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, అసోసియేషన్ సభ్యులు సీనియర్ క్రీడాకారులు, యూటీఎఫ్ నాయకులు, ఆత్మీయ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

రైతులను నష్ట పరిచే చర్యలను సహించం : సీపీఐ



ఇన్‌చార్జ్ కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, నాయకులు

అనంతపురం అర్బన్: రైతులను నష్టపరిచేలా హంద్రీ-నీవా కాలువ అడుగున సిమెంట్ కాంక్రీట్ వేస్తే సహించబోమని సీపీఐ నాయకులు హెచ్చరించారు. ప్రభుత్వ అనాలోచిత చర్యతో భూగర్భ జలాలు అడుగంటి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇన్‌చార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మకు వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 3.50 లక్షల ఎకరాలకు డిస్ట్రిబ్యూటరీల ద్వారా సాగునీరు అందించాల్సి ఉందన్నారు. పిల్ల కాలువల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం బాధాకరమన్నారు. కనీసం ఇప్పుడు కాలువలో ప్రవహించే నీటి ద్వారానైనా బోర్లు రీచార్జి అవుతున్నాయన్నారు. కాంక్రీట్ వేస్తే నీరు భూమిలోకి ఇంకకపోవడంతో భూగర్భజలాలు తగ్గి బోర్లు ఎండిపోతాయన్నారు. రైతులకు నష్టం చేకూర్చే పనులు చేపడితే రాజకీయ పక్షాలు, రైతు సంఘాలు అన్నీ ఏకమై అడ్డుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీష్, జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున, రామకృష్ణ, కృష్ణుడు, చిరంజీవి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి నాగలమడకలో ఉత్సవాలు

పావగడ: తాలూకాలోని నాగలమడక గ్రామంలో వెలసిన సుబ్రహ్మణ్య స్వామి జాతరోత్సవాలు జనవరి 3 నుంచి 15వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. 3న అంకురార్పన, 4న ధ్వజారోహణ, కళ్యాణోత్సవం, 5న బ్రహ్మ రథోత్సవం నిర్వహిస్తారు. 11న మయూర వాహన సేవ మిగతా రోజుల్లో సర్వసేవ పూజలు జరుగుతాయి.

చేతనైతే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇప్పించు

● విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఏఐఎస్‌ఎఫ్ నాయకుల సవాల్



నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

ఉరవకొండ: ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన బకాయిలు విడుదల చేయడంలో కూటమి ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యం వహిస్తోందని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు మండిపడ్డారు. బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేయకుండా కళాశాలల యజమాన్యాలు వేధిస్తున్నాయని, ఈ విషయంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు చేతనైతే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇప్పించాలంటూ సవాల్ విసిరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన బకాయిలపై ఉరవకొండలో ఏఐఎస్‌ఎఫ్ అధ్వర్యంలో సోమవారం విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఉన్నత చదువులు అభ్యసించిన తాము కూటమి పెద్దల వైఖరితో ఇకపై కూరగాయలు, ఆకుకూరలు అమ్ముకోవాల్సి వస్తుందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. రూ.2,100 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, రూ.1,480 కోట్ల విద్యాదీవెన బకాయిలు చెల్లించి విద్యార్థుల భవిష్యత్ నాశనం కాకుండా చూడాలన్నారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనమంతరాయుడు మాట్లాడుతూ... యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీని అధికారం చేపట్టిన తర్వాత నెరవేర్చడంలో ఘోరంగా విఫలమయ్యారని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యార్థులకు నాలుగు విడతలుగా డబ్బులు జమ చేసేదని గుర్తు చేశారు. ఇప్పటికైన ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన బకాయిలు విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున్న ఉద్యమం చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. అలాగే జీఓ 77ను రద్దు చేసి కూటమి పెద్దలు తమ చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్, నియోజకవర్గ అధ్యక్షుడు చందు, నాయకులు రాజు, లెనిన్, రాజేష్, సాగర్, రాజేష్, లాలుస్వామి పాల్గొన్నారు.

● రెండో పంటకు సిద్ధం

మొదటి పంట ఆశించిన స్థాయిలో దిగుబడి ఇవ్వలేదు. కూటమి సర్కార్ నుంచి ప్రోత్సాహమూ లేదు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అటకెక్కించారు. పెట్టుబడి సాయాన్ని (అన్నదాత సుఖీభవ) ప్రభుత్వం అందిస్తుందో... లేదో తెలియదు. అయినా రైతులు రెండో పంట సాగుకు సిద్ధమయ్యారు. ఈ ప్రపంచంలో లాభాపేక్ష లేకుండా ప్రజల కోసం పాటుపడే ఉత్పత్తిదారుడు ఎవరైనా ఉన్నారా అంటే... అది అన్నదాత అనేది అక్షర సత్యమని వారు పడుతున్న కష్టాన్ని చూస్తే అర్థమవుతుంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



పాములాయి వద్ద బోరు బావుల కింద వరి సాగుకు సిద్ధం చేసిన మడులు



అనంతపురం శివారులో వరినాట్లు వేస్తున్న మహిళా కూలీలు



ఆత్మ విశ్వాసం కనబరుస్తున్న రైతన్న



వరి మడుల మధ్య భోజనం చేస్తున్న కూలీలు

రైతన్నలకు ప్రీమియం కష్టాలు

- ఉచిత పంటల బీమాకు మంగళం
- ప్రీమియం చెల్లింపునకు రైతుల అవస్థలు
- నేటితో ముగియనున్న గడువు


పూత దశలో ఉన్న పప్పుశనగ

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం అన్నదాతలను నిలువునా మోసం చేస్తోంది. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఎన్నికల సమయంలో ఒక్కో రైతుకు రూ.20 వేల పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పిన చంద్రబాబు.. దాని గురించి మాట్లాడటం లేదు. అప్పులు చేసి మరీ సాగు చేసిన పంటలకు బీమా (ఇన్సూరెన్స్) కూడా చేయించడం లేదు. బీమా మొత్తం రైతులే చెల్లించాలంటూ ఆదేశాలు జారీ చేసింది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో సాగు చేసిన పంటలన్నింటికీ ప్రభుత్వమే బీమా చెల్లించింది. రైతులు ఇబ్బందులు పడకుండా ఇంటి వద్దకే సేవలు అందించింది. అయితే తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించింది. హామీలు అమలు చేయకపోగా.. రైతాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోంది. ఉచిత పంటల బీమాకు మంగళం పాడింది. రైతన్నలపై బీమా పిడుగు వేసింది. ఈనెల 31వ తేదీతో ఇన్సూరెన్స్ చెల్లింపు గడువు ముగియనుంది. దీంతో బీమా మొత్తం చెల్లించేందుకు రైతన్నలు అవస్థలు పడుతున్నారు.

800 ఎకరాల్లో పప్పుశనగ సాగు..

ఈ ఏడాది మండల వ్యాప్తంగా దాదాపు 800 ఎకరాల్లో పప్పుశనగ సాగైంది. ప్రస్తుతం మబ్బులతో కూడిన వాతావరణం, కురుస్తున్న వర్షాలకు పప్పుశనగ పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పంట పులుసు (పూత) దశలో ఉంది. ఇలా వర్షాలు కురిస్తే దిగుబడి తగ్గిపోయి నష్టాలపాలయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఒక ఎకరాలో పప్పుశనగ సాగుకు దాదాపు రూ.20 వేల వరకూ ఖర్చు పెట్టినట్లు తెలిపారు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ఉదయం నుంచి సాయంత్రం వరకు సూర్యుడు కనపడకుండా మబ్బులు పట్టి చినుకులు రాలుతూనే ఉన్నాయి. ఇలాంటి మబ్బులతో కూడిన వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బదింటాయని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఒక వైపు కంది కోత దశలో ఉంది. వర్షాల కారణంగా కంది సాగు చేసిన రైతులు కంది పంటను కోయడానికి సిద్ధంగా లేరు. అంతేకాకుండా గతంలో రైతులు సాగు చేసిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసేది. ప్రస్తుతం కందుల కొనుగోలుకు ప్రభుత్వం ముందుకు రావాలని రైతులు కోరుతున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 5 వేల ఎకరాల్లో కంది పంటను సాగు చేశారు. ఒక క్వింటా కందులు ప్రస్తుతం మార్కెట్‌లో రూ.6 వేల వరకు పలుకుతోంది. రైతులు పండించిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాల్సిన అవసరం ఉంది. రబీ సజీన్‌లో సాగు చేసిన పంటలకు ఈనెల 31వ తేదీ వరకు ఇన్సూరెన్స్ చేయించుకునేందుకు అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పప్పుశనగకు రూ.480, వరికి రూ.630, మొక్కజొన్నకు రూ.525, జొన్నకు రూ.315, వేరుశగకు రూ.480, టమాటకు రూ.1,600 చొప్పున ఒక ఎకరాకు పైన తెలిపిన మొత్తం చెల్లించాలి.

ఇన్సూరెన్స్ చేయించుకుంటే మేలు

రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు రైతులు వెంటనే ఇన్సూరెన్స్ చేయించుకోవాలి. పంటల సాగుకు సంభందించి రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించి పంటలకు సూచనలు ఇస్తున్నాం. కందుల కొనుగోలుకు సంబంధించి మాకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. త్వరలోనే కందుల కొనుగోలుకు సంబంధించిన ఉత్తర్వులు, వాటి ధరలు వచ్చే అవకాశం ఉంది. వచ్చిన వెంటనే రైతులకు తెలియజేస్తాం.

– సుచరిత, ఏఓ

క్లుప్తంగా

పాఠశాల అభివృద్ధికి విరాళం


హెచ్‌ఎం సాంబశివుడుకు విరాళం అందజేస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

రాప్తాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది సోమవారం రూ.20 వేలు విరాళంగా అందజేశారు. ఈనెల 7వ తేదీన పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లో పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పాఠశాల సిబ్బంది కోరారు. అదే రోజు ఎంపీడీఓ కార్యాలయం నుంచి రూ.20 వేలు ఇస్తామని సిబ్బంది ప్రకటించారు. చెప్పిన విధంగా సోమవారం హెచ్‌ఎం సాంబశివుడుకు రూ.20 వేలు నగదును ఎంపీడీఓ కార్యాలయం తరఫున అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకే తిరుపాలు, సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం


పదో తరగతి విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓలు

ఆత్మకూరు: పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయి. విద్యార్థులు కష్టపడి చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజనేయులు సూచించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలను తనిఖీ చేసి పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతి సబ్జెక్టుపై అవగాహన పెంచుకుని అర్థం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఈ మూడు నెలలు ఏకాగ్రతతో చదవాలన్నారు. సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలన్నారు. కష్టమైన సబ్జెక్టుకు సమయం ఎక్కువ కేటాయించి చదవాలన్నారు. నేర్చుకున్న విషయాలను రాస్తే ఎక్కువగా గుర్తుంటాయని తెలిపారు. ఇంగ్లిష్, ఆంగ్లంపై ఎక్కువ శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ పడరాదని తెలియజేశారు.

‘తపాలా’ క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం సిటీ: ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్, అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన ఆంగ్ల నూతన సంవత్సర క్యాలెండర్లను సోమవారం ఆవిష్కరించారు. అనంతపురంలోని హెడ్ పోస్టాఫీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీడీఎస్ కార్యదర్శి కృష్ణయ్య యాదవ్, పి–3 కార్యదర్శి శంకరయ్య, పి–4 కార్యదర్శి రమేశ్ గౌడ్ ఆధ్వర్యంలో క్యాలెండర్లను ఆవిష్కరించారు. తపాలా శాఖ అమలు చేస్తున్న వివిధ రకాల పథకాలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి, సంస్థ అభివృద్ధికి పాటుపడదామని పిలుపునిచ్చారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి


తహసీల్దార్ మోహన్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం మన్నీలలో దళితులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు కోరారు. సోమవారం తహసీల్దార్ మోహన్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాప్తాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటిదాకా ఎవరికీ ఒక్కసెంటు కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా పేదలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ అనంతపురం రూరల్ మండల కార్యదర్శి రమేష్, ఏఐవైఎఫ్ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి ధనుంజయ, వెంకటరాముడు, నాగేష్, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

బ్రాహ్మణ మహిళలకు శిక్షణ ఇవ్వాలి

అనంతపురం కల్చరల్: బీసీ, ఈబీసీ మహిళలకు 90 రోజుల శిక్షణ ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నిరుపేద బ్రాహ్మణ మహిళలకు కూడా శిక్షణ ఇవ్వాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు రఘునాథరావు సోమవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. పేదలకు అందించే కుట్టు మిషన్లు బ్రాహ్మణులకు కూడా అందజేస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ప్రవీణ్ సాయి మృతి బాధాకరం


ప్రవీణ్‌సాయి మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి అనంతపురం జిల్లా సోషల్ మీడియా మాజీ కన్వీనర్ ప్రవీణ్‌సాయి విట్టల్ మృతి బాధాకరమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈనెల 29న రాత్రి ప్రవీణ్‌సాయి గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం నగరంలోని శారదనగర్‌లో ఉన్న ప్రవీణ్‌సాయి మృతదేహానికి అనంత వెంకటరామిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. పార్టీ ఆవిర్భావం నుంచి ప్రవీణ్‌సాయి సోషల్ మీడియాలో ఎంతో చురుగ్గా పని చేశారన్నారు.

74 అర్జీల స్వీకరణ

అనంతపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 74 అర్జీలు వచ్చినట్లు కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. భార్యభర్తల గొడవలు, రస్తా వివాదాలు, కుటుంబ సమస్యలపై ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అనంతపురం మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై నోరు మెదపరా?

- ఎమ్మెల్యే దగ్గుపాటిపై మేయర్ వసీం ఆగ్రహం


మాట్లాడుతున్న మేయర్ వసీం, చిత్రంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం ఏర్పాటై 7 నెలలు కావస్తోంది.. ఇంత వరకు 7 రూపాయలైన ప్రభుత్వం నుంచి తెచ్చారా దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్? ఎప్పుడు చూసిన మైకుల ముందుకు వచ్చి.. గత ప్రభుత్వంలో అవినీతి జరిగిందంటూ పూటకో మాట మాట్లాడటం సరికాదని మేయర్ వసీం ధ్వజమెత్తారు. సోమవారం మేయర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, ఇసాక్, అనిల్‌కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, రమణ, రాజేశ్వరి, సాకే చంద్రలేఖతో కలసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది జూలైలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో కంపోస్టు యార్డులో అవినీతి జరిగిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆరోపణలు చేశారన్నారు. ఈనెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో నగరంలో చెత్త పేరుకుపోయిందని.. బయో మైనింగ్ వారికి బిల్లులు చెల్లించి, మరోసారి చెత్త నిర్వహణ చేపట్టాలని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. బయోమైనింగ్‌కు సంబంధించి సమగ్ర విచారణ జరిగాకే బిల్లులు చేయాలని తాము డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పారదర్శకంగా అభివృద్ధి పనులు జరిగాయన్నారు. నగరపాలక సంస్థ చరిత్రలో లేని విధంగా రూ.1,045 కోట్ల అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. అదే రోడ్లపై వెళ్తున్న దగ్గుపాటికి అభివృద్ధి కన్పించడం లేదా అని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకుల ఒత్తిడితోనే కమిషనర్ నాగరాజు వెళ్లిపోయారని ఎమ్మెల్యే చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఎవరు ఫోన్లు చేసి కమిషనర్‌ను బెదిరిస్తే వెళ్లారో అందరికీ తెలుసన్నారు. గత టీడీపీ పాలనలో (2014–19)లో టీడీపీ నేతల కారణంగా విధులు నిర్వహించిన కమిషనర్లు ఏ స్థాయిలో అవమాన పడ్డారో నగర ప్రజలు మర్చిపోలేదన్నారు. తాము పారదర్శకంగా పనులు చేసేందుకు అధికారులకు స్వేచ్ఛనిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి కోట్లాది రూపాయల పనులు ఆగిపోయాయని, దీనిపై ఎమ్మెల్యే ఎందుకు నోరుమెదపరన్నారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మాట్లాడుతూ.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మురికివాడలను స్మార్ట్ స్ట్రీట్‌లుగా, జిల్లా కేంద్రంలో రూ.వందల కోట్లతో బ్రిడ్జ్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్ మాట్లాడుతూ.. గత వైఎస్సార్ సీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో నగరంలో 67 కిలోమీటర్ల బీటీ, సిమెంట్ రోడ్లు వేశారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు జావెద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు దుర్మార్గం


ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు


ఆత్మకూరులో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం అర్బన్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తక్షణం తన పదవికి రాజీనామా చేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం నుంచి టవర్‌క్లాక్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వరకు నాయకులు, కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు, సీపీఐ, ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శులు జాఫర్, రాఘవేంద్ర మాట్లాడారు. అంబేడ్కర్‌ను అవమానించేలా పార్లమెంట్‌లో అమిత్‌షా వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగాన్ని అవమానించడమే అన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలను ప్రధాని మోదీ సమర్థిస్తూ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకుడు నాగరాజు, సీపీఐ సహాయ కార్యదర్శులు నారాయణ స్వామి, మల్లికార్జున, సీపీఎం, సీపీఐ నాయకులు రామిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఆర్‌వీ నాయుడు, వెంకట నారాయణ, అల్లీపీరా, రమణ, మహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గం. అమిత్‌షాను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని సీపీఐ మండల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆత్మకూరు ప్రధాన రహదారిలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని సృష్టించిన అంబేడ్కర్‌పై పార్లమెంట్ సమావేశాల్లో అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. స్త్రీలకు సమాన హక్కులు కల్పించే బిల్లు పార్లమెంట్‌లో పాస్ కాకపోవడంతో అంబేడ్కర్ క్యాబినెట్ పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా వెంటనే భారతదేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు శివ, రామాంజనేయులు, సరస్వతి, గోవింద్, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

రాప్తాడు: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బాల రంగయ్య, సీపీఐ నియోజకవర్గవర్గ కార్యదర్శి రామకృష్ణ, అనంతపురం రూరల్ రాప్తాడు ప్రాంతీయ కార్యదర్శి టి.రామాంజనేయులు డిమాండ్ చేశారు. అమిత్‌షా చేసిన వాఖ్యలకు నిరసనగా వామపక్షాలు ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం రాప్తాడులో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమిత్‌షా క్షమాపణ చెప్పే వరకు ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పోతులయ్య, రాజు, సుబ్బిరెడ్డి, ధనుంజయ, చలపతి, నారాయణ స్వామి, వన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో పూజలు


అలంకరణలో గౌరి ప్రసన్నేశ్వర స్వామి

అనంతపురం కల్చరల్: స్థానిక మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయాన్ని సోమవారం జిల్లా ఎస్పీ జగదీష్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన జిల్లా ఎస్పీ జగదీష్ కుమార్‌కు ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ప్రధాన అర్చకులు నరసింహ శాస్త్రి, సిబ్బంది పరమేష్ తదితరులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం చేయించారు. అనంతరం ఎస్పీ దంపతులకు శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

శివాలయంలో..

రాప్తాడు: మండలంలోని పలు శివాలయాల్లో సోమవారం శివలింగాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయనగర్‌లో వెలసిన గౌరి ప్రసన్నేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేం చేశారు. అలాగే రాప్తాడులో నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శివలింగానికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం చేపట్టారు. ఆలయ సమీపంలోని పార్వతీ దేవి అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలు, నిమ్మకాయల దండలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో శివాలయాలకు చేరుకుని పూజలు చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సక్షమ్ సభ్యులు

అనంతపురం కల్చరల్: దివ్యాంగులకు ప్రయోజనాలు కల్పించే చట్టాలను పార్లమెంటు ప్రత్యేకంగా తయారు చేసింది. ఈ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ యాదవ్ అన్నారు. సక్షమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కోవూరు నగర్‌లోని సంస్థ కార్యాలయంలో చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్, సీనియర్ న్యాయవాది నామసేవ హరికృష్ణ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విభాగ్ సంఘ చాలక్ హిమకర్ మాట్లాడారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు, సమాజంలో వారిపై చూపుతున్న వివక్షపై చర్చించారు. 2016లో వచ్చిన ఆర్పీడబ్ల్యూడీ చట్టం, దివ్యాంగులకు ఎంత రక్షణగా ఉంటుందో తెలియజేశారు. ఆ చట్టం వివరాలను తెలియజేసే పుస్తకాలను దివ్యాంగులందరికీ అందజేశారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను సక్షమ్ ప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సక్షమ్ ఉపాధ్యక్షుడు కోదండరామ, జిల్లా కార్యదర్శి మల్లికార్జున, అరుణ్, శీనా నాయక్, భాగ్యలక్ష్మి, సత్యసాయి జిల్లా బృందాలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో సత్తా


బంగారు పతకాలు సాధించిన హృత్విక్ రెడ్డి

అనంతపురం: ఇటీవల ఎస్ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన ఎం.హృత్విక్ రెడ్డి రెండు విభాగాల్లో బంగారు పతకాలు సాధించాడు. అదే విధంగా చిన్నారులు రాణ్య తార, విశ్రుత్, అవిరామ్, సహస్ర, కౌశిక్ ,విగ్నేష్, యోగినాథ్, ప్రతీష్ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి వివిధ విభాగాల్లో పతకాలను సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కాగా.. రాంనగర్‌లోని అనంతేశ్వర స్కేటింగ్ అకాడమీలో కోచ్ కేదార్‌నాథ్ ఆధ్వర్యంలో హృత్విక్ రెడ్డి శిక్షణ పొందాడు. ఎస్ఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ అధినేత, ప్రముఖ కాంట్రాక్టర్ వై.శివారెడ్డి మనువడైన ఎం.హృత్విక్ రెడ్డి స్కేటింగ్‌లో సత్తా చాటడడంతో పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

6 గంటల నుంచే రేషన్ అందించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీనాయక్, సీఎస్‌డీటీ లక్ష్మీదేవి

ఆత్మకూరు: మండలంలోని రేషన్ డీలర్లు 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచే లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ లక్ష్మీనాయక్, సీఎస్‌డీటీ లక్ష్మీదేవి రేషన్ డీలర్లను ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోజు ఒక్కో రేషన్ డీలర్ 150 నుంచి 200 మంది లబ్ధిదారులకు సరుకులు అందించాలన్నారు. ప్రభుత్వం నుంచి ఈనెల బియ్యం, చక్కెర, జొన్నలు వచ్చాయన్నారు. రేషన్ డీలర్లు సకాలంలో డీడీలు చెల్లించాలన్నారు. రేషన్ పంపిణీ సమయంలో ఏదైనా సమస్యలు తలెత్తితే వీఆర్వోల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా సరుకులు అందించాలన్నారు.

పాఠశాలకు వస్తువుల వితరణ


మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు దివాకర్ రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం రూరల్ మండలం సిండికేట్ నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కెనరా బ్యాంక్ వారు రూ. 6 లక్షల విలువైన వివిధ వస్తువులను వితరణ చేశారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెండు ల్యాబ్ టేబుళ్లు, 10 స్టూళ్లు, 85 డెస్కులు, 3 బీరువాలు, ర్యాక్‌లు అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ దేవరాజు మాట్లాడుతూ.. వస్తువులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. ప్రతిభ గల పేద విద్యార్థులకు తమ బ్యాంకు ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు దివాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో పేద వర్గాల విద్యార్థులే ఎక్కువగా చదువుతున్నారన్నారు. అలాంటి వారికి దాతల సహకారం చాలా ఉంటుందన్నారు. దాతలు ఇచ్చిన వస్తువులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు సిబ్బంది, పాఠశాల కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంగినేపల్లిలో కంటి వైద్య శిబిరం


కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: కంటి చూపుపై విద్యార్థులు శ్రద్ధ తీసుకోవాలని ఆప్తాలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప సూచించారు. మండల పరిధిలోని గంగినేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించి కళ్ల అద్దాలకు సిఫార్సు చేశారు. అనంతరం డాక్టర్ ఉరుకుందప్ప మాట్లాడుతూ.. కంటి సమస్యలు వస్తే సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నాటు వైద్యం చేయించుకోవద్దన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వాణి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది శ్రీనివాసులు, ఐశ్వర్య, కృష్ణమ్మ, రాజేశ్వరి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

రాప్తాడు: నూతన సంవత్సర వేడకల పేరుతో అత్యుత్సాహం ప్రదర్శించొద్దు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. శాంతి భద్రతలకు భంగం కలిగించకూడదని స్పష్టం చేశారు.

ఆత్మకూరు: నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ లక్ష్మీనారాయణ సూచించారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడరాదని ప్రజలకు సూచించారు. చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గుండెపోటుతో రామగిరి ఎంపీపీ మృతి

రామగిరి: మండల పరిషత్ చైర్‌పర్సన్ (ఎంపీపీ) మీనుగ నాగమ్మ (72) సోమవారం రాత్రి 10 గంటలకు గుండెపోటుతో మృతిచెందారు. కొన్ని రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుమారుడు, సర్పంచ్ మీనుగ నాగరాజు తెలిపారు. కాగా, రామగిరి మండలానికి తొలి మహిళా బీసీ ఎంపీపీగా నాగమ్మ ఖ్యాతి దక్కించుకున్నారు. ఆమె మృతి విషయం తెలుసుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె మృతి తీరని లోటుగా మండల ప్రజలు పేర్కొన్నారు.